

ఆదివాసీల చట్టాలపై యువతకు శిక్షణ

బోథ్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్డీ(బి) గ్రామంలోని రాయి సెంటర్‌లో దాత్రి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివాసీ చట్టాల పైన గిరిజన యువతీ, యువకులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మూడు రోజుల పాటు ట్రస్టు సభ్యులు హేమంత్ అరవింద్ సిడాం గణపతిలు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వారి తెలిపారు. ఈ నెల 18 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని గిరిజన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గిరిజన మహిళలకు వరం.. ఆదివాసీ ఆహారం



● ఉట్నూర్‌లోని ఐటీడీఏ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన ఆదివాసీ ఆహారం కేంద్రం




● బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


● ఆదివాసీ మహిళలు తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డులు

- ఐటీడీఏ పీవో ఆలోచనతో బాలికల పాఠశాలలో ఆరోగ్య పోషణ మిత్ర పథకం
- గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో సత్ఫలితాలను ఇస్తున్న ఇప్పపువ్వు లడ్డు
- రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ పెయిర్‌లలో ఇప్పపువ్వు లడ్డుకు బహుమతులు
- 2019లో ఐటీడీఏ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడలో రూ.14లక్షల వ్యయంతో కేంద్రం ఏర్పాటు
- జిల్లాలోని 33 పాఠశాలల్లో 8,307 మంది బాలికలు

ఉట్నూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గతంలో జిల్లాలో పని చేరేసిన జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ ఆలోచన మేరకు రూపొందించిన ఆదివాసీ గిరిజనుల ఆహారం ఇప్పపువ్వు లడ్డు పరిశ్రమ ఆదివాసీ గిరిజన మహిళలకు వరంగా మారింది. ప్రకృతిలోని అడవులను పూజించే గిరిజనులు ఇప్పపువ్వు చెట్టును కూడా దైవంగానే భావిస్తారు. ప్రతియేటా వేసవి కాలంలో అడవుల్లోని ప్రకృతి ఒడిలో లభించే ఇప్పపువ్వును సేకరించి గిరిజనులు అమ్ముకోవడంతో పాటు తమ సంప్రదాయ వంటలు కూడా చేసుకోవడానికి ఉపయోగిస్తారని భావించిన కలెక్టర్ దివ్యదేవరాజన్ ఆలోచన మేరకు 2019లో ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని పారిశ్రామిక వాడలో రూ.14లక్షలతో కేంద్రం ఏర్పాటు చేసి గిరిజన మహిళా గ్రూపునకు అప్పగించారు. 12 మంది గల గిరిజన మహిళా సంఘానికి అధ్యక్షురాలుగా ఉన్న బాగుబాయి ఆధ్వర్యంలో ఇప్పపువ్వు లడ్డు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇప్పపువ్వు లడ్డు తయారీకి ఇప్పపువ్వుతో పాటు నెయ్యి, బెల్లం, బాదం, జీడీపప్పు, నువ్వులు, పల్లీలు సమపాళ్లలో కలిపి లడ్డులు తయారు చేస్తున్నారు. కిలో లడ్డులు రూ.400కు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

పీవో ఆలోచన మేరకు పథకం

ప్రస్తుతం ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా వచ్చిన ఖుష్బుగుప్తా ఆలోచన మేరకు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభించారు. గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో తరచు విద్యార్థినులు అనారోగ్యానికి గురవుతూ బాధపడుతూ ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పౌష్టికాహారం అందిస్తున్నప్పటికీ.. రక్తలేమితో బాధపడుతున్నట్లు గుర్తించారు. రక్తలేమి సమస్యను అధిగమించడానికి ఇప్పపువ్వు లడ్డులో ఉన్న పోషక పదార్థాలను గుర్తించి లడ్డులు ఇవ్వడం ద్వారా రక్తాన్ని అధిగమించవచ్చని భావించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో మూడు నెలల కిందట ఉట్నూర్‌లోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభించారు. ఐటీడీఏ పీవో ఆలోచనలను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏ ప్రాంతాలలో ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలల్లో అమలు చేయడానికి ప్రణాళికలు చేస్తామని మంత్రి సీతక్క ప్రకటించడం హర్షనీయం. వారంలో ప్రతీ బుధ, శుక్రవారం ఒక్కొక్క బాలికకు రెండేసి లడ్డులను ఇవ్వడంతో పాటు పోలిక్‌యాసిడ్, విటమిన్ సి మాత్రలు ఇవ్వాలని

(తరువాయి 6వ పేజీలో...)

ఇప్పపువ్వు లడ్డు తయారీతో ఉపాధి

: బాగుబాయి, ఆదివాసీ ఆహారం కేంద్రం అధ్యక్షురాలు, ఉట్నూర్



ప్రకృతిలో లభిస్తున్న ఇప్పపువ్వుతో తాము తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డు గిరిజన ప్రాంతాల బాలికల్లో రక్తం వృద్ధి చేస్తుండడం ఆనందంగా ఉంది. రక్తలేమితో గిరిజన బాలికలు అనారోగ్యానికి గురవుతున్నట్లు గుర్తించిన ఐటీడీఏ అధికారులు.. తమ పరిశ్రమ ద్వారా బాలికల పాఠశాలలకు కావల్సిన ఇప్పపువ్వు లడ్డులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మాకు ప్రతీనెల రూ.6 నుంచి 8లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఖర్చులు పోను సభ్యులందరికీ ఒక్కొక్కరికీ రూ.20వేల వరకు ఆదాయం లభిస్తుంది.

బాలికల ఆరోగ్యం మెరుగైంది

: బానోత్ శ్రీవేణి, హెచ్‌డబ్ల్యూవో, ఉట్నూర్



ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో 625 మంది బాలికలు చదువుకుంటున్నారు. ఇందులో భాగంగా మొత్తం 13 మంది బాలికలు రక్తలేమితో బాధపడుతుండగా.. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రవేశపెట్టిన ఆరోగ్య పోషణ మిత్ర పథకం ద్వారా ఇప్పపువ్వు లడ్డుతో పాటు, పోలిక్‌యాసిడ్ మాత్రలు, విటమిన్ సి మాత్రలు ఇవ్వడంతో బాలికల ఆరోగ్యం మెరుగయ్యింది.

ఐటీడీఏ పీవో ఆదేశాలతో ఆరోగ్య పరీక్షలు

: డాక్టర్ కుడిమెత మనోహర్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఐటీడీఏ ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో చదువుతున్న బాలికలకు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాం. ఇప్పపువ్వు లడ్డులు, పోలిక్ యాసిడ్, విటమిన్ సి మాత్రం ఇవ్వడం ద్వారా బాలికల్లో హిమోగ్లోబిన్ పెరిగింది.


పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న ఆర్సీవో

సజావుగా కాలేజ్ ఆఫ్ ఎక్సిలెన్స్ ప్రవేశ పరీక్షలు

ఉట్నూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎక్సిలెన్స్ గురుకుల కళాశాలలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్స్ పరీక్షలు సజావుగా జరిగాయి. ఉట్నూర్ లాలిటేకిడి గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు ఎంపీసీలో 320 మంది విద్యార్థులకు గాను 304 మంది, బైపీసలో 51 మంది విద్యార్థులు కేటాయించగా విద్యార్థులు అందరు హాజరయ్యారు. 16 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు ప్రిన్సిపల్ గులం మోహినొద్దిన్ తెలిపారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ ఆగస్టియన్ పరిశీలించారు. హరిరామ్, నరసయ్య, కొల్లూరి రాజేందర్‌లు ఇన్విజిలేటర్లుగా బాధ్యలు నిర్వహించారు.

సద్గురు బాజీరావ్ బాబా చూపిన సన్మార్గంలో నడవాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతీఒక్కరు తమకు ఉన్న చెడు వ్యసనాలను వీడి సద్గురు బాజీరావ్ చూపిన సన్మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. జైనథ్ మండలంలోని ఆకూర్ల గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న బాజీరావ్ బాబా సప్తాహ వేడుకలకు ముగింపు సందర్భంగా ఆదివారం వేడుకలకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకున్నారు. ఈ సందర్భంగా వివిధ వేషాధారణలో ఉన్న దేవతల ఎండ్లబండికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పెద్దఎత్తున అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జైనథ్ మండల పార్టీ అధ్యక్షుడు కట్కం రాందాస్, మండల అధ్యక్షుడు లోకకరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సప్తాహలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్

బుడుందేవ్ జాతరలో భక్తుల సందడి


బుడుందేవ్‌కు పూజలు చేస్తున్న ప్రజలు


శ్యామపూర్ జాతరలో కిక్కిరిసిన జనం

● జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం

ఉట్నూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మేస్రం గిరిజనుల ఆరాధ్య దైవం అయిన బుడుందేవ్ జాతరకు ఆదివారం ప్రజలు భారీగా తరలివచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు షాంపూర్ జాతరకు తరలి రావడంతో ప్రజలతో జాతర కిక్కిరిసి పోయింది. జాతరకు వచ్చిన ప్రజలు ముందుగా నందీశ్వరుడు అయిన భుడందేవ్‌కు పూజలు నిర్వహించారు.ఆ తర్వాత జాతరలోని రంగుల రత్నాల వద్ద తమ పిల్లలతో ఆనందోత్సవాలు నిర్వహించుకున్నారు. అంతేకాకుండా పక్షం రోజుల కింద భుడందేవ్‌కు పూజలు నిర్వహించి మేస్రం గిరిజనులు జాతర ప్రారంభించగా శనివారం నుంచి జాతర కాసింత ఊపు అందుకుంది. ప్రజలను చూసి వ్యాపారుల సైతం సంతోషం వ్యక్తం చేశారు. జాతరకు వచ్చిన మహిళలు నందీశ్వరుడు పూజలు చేసిన అనంతరం స్త్రీల అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తూ ఆ తర్వాత ఇండ్లకు కావాల్సిన ఇత్తడి, అల్యూమినియం సామాన్లతో పాటు పూజ వస్తువులు కొనుగోలు చేసుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉట్నూర్ పోలీసులు బందోబస్తు చర్యలు నిర్వహించారు.

బాబాలను నమ్మి మోసపోకండి : ఆదిలాబాద్ డీఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను మాయ మాటలు చెప్పి మోసం చేసే నకిలీ బాబాలను నమ్మొద్దని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆదిలాబాద్ ఖుర్షిద్‌నగర్‌కు చెందిన అజారోద్దీన్ ఇలానే బాబా మాటల్లో మోసపోగా కేసు నమోదు చేశారు. కాగా ఆదివారం టూటౌన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. పట్టణంలోని ఖుర్షిద్‌నగర్‌కు చెందిన అజారోద్దీన్‌కు బంగారు గూడకు చెందిన యాసీన్ ఉర్ఫ్ జనాబ్ జనవరిలో పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో వారి ఇంట్లో సమస్య ఉందని బాబాకు అజారోద్దీన్ తెలిపాడు. సమస్య పరిష్కారంతోపాటు ఇబ్బందులు తొలుగుతాయని బాబా చెప్పాడు. బాబాను నమ్మిన రూ.5600 తాయిత్తుల కోసం ఇచ్చాడు. బాబా పుర్రె బొమ్మల పేపర్‌లో ఏవో అక్షరాలు రాసి ఇచ్చారు. 45 రోజుల పాటు దిండు కింద వాటిని పెట్టుకోవాలని సూచించాడు. బాబా చెప్పిన విధంగా ఇంట్లో పెట్టుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత వింతగా ప్రవర్తించడంతో భార్య, తల్లి ఇద్దరు అతన్ని వదిలి వేరే చోటకు వెళ్లిపోయారు. బాబా ఇచ్చిన తాయిత్తులతో తనకు ఇబ్బంది కలుగుతుందని బాధితుడు ఫిర్యాదు చేయడంతో యాసిన్‌పై కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి బంగారు గూడలోని బాబా ఇంటిని సోదాలు చేయగా వింతైన వస్తువులు లభించాయని, ఏ రోగానికి ఏ మంత్రం వేయాలో అందులో రాసి ఉందని డీఎస్పీ తెలిపారు. దీంతో బాబాకు నోటిసులు అందించామని పేర్కొన్నారు. ప్రజలు కూడా మూఢనమ్మకాలపై విశ్వాసం పెంచుకోవద్దని, ఏదైన ఆరోగ్య సమస్యల ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. నకిలీ బాబాల గురించి ప్రజల వద్ద సమాచారం ఉంటే అందించాలని, అలాంటి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సమావేశంలో సీఐ కరుణాకర్ రావు, ఎస్సై విష్ణు ప్రకాష్ పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

అతివలకు అండగా.. ఆదిలాబాద్ మెప్మా!

● బ్యాంకు లింకేజీ రుణాలతో ఆర్థిక అభివృద్ధి
● మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు

7 లో




మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్- మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టబద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ప్రచారసభ నిమిత్తం జిల్లా కేంద్రంకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భవన్ వద్ద ఆమెకు స్వాగతం పలికారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే వెడ్మబొజ్జుకు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పుష్పగుచ్చాలు అందజేశారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

నేటి నుంచి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● తలమడుగులో 50 ఏళ్ల నాటి పురాతనమైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతియేటా ఉత్సవాలు

తలమడుగు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అతి పురాతనమైన వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఇంద్రాసేనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్మించిన వేంకటేశ్వర స్వామి అతిపురాతనమైన ఆలయమని గత 50 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవలనే గ్రామానికి చెందిన పుట్టింటి ఆడపడుచుల సహకారంతో దాదాపు మూడున్నర లక్షల వ్యయంతో స్వామి వారికి మకర తోరణం, అలంకర వస్తువులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో తలమడుగు గ్రామానికి చెందిన కాటిపెల్లి వసంత్‌రెడ్డి సహకారంతో రూ.3లక్షల వ్యయంతో ధ్వజ స్థంబాన్ని నిర్మించామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా ఆలయ అభివృద్ధి కోసం శాశ్వత చందాదారులు, భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 17న సోమవారం యజ్ఞ ప్రారంభం, 18న శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి అభిషేకం, బలిహారణం, 19న యజ్ఞ పూర్ణహుతి స్వామివారి కళ్యాణం రథోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ బ్రహ్మోత్సవాలకు తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ జిల్లా చుట్టు పక్కల నుంచి వేలాది మంది భక్తులతో పాటు మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్నారన్నారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామ యువజన సంఘాలు గ్రామ పెద్దల సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ బ్రహ్మోత్సవాల నిర్వాహణ కోసం వేద పండితులు రాంగోపాలచారి, నేరేళ్ల రంగాచారి, శ్రీనివాసచారి, కళ్యాణచారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిం చడం జరుగుతుందని పేర్కొన్నారు.

గిరిజన మహిళలకు వరం.. 'ఆదివాసీ ఆహారం'



నర్సాపూర్‌లోని బాలికల ఆశ్రమ పాఠశాల

(5వ పేజీ తరువాయి...)

భావించి అమలు చేయడం ప్రారంభించారు. గిరిజన బాలికలకు రక్తం వృద్ధి చేయడంతో పాటు ఆదివాసీ ఆహారం పరిశ్రమ నిర్వహిస్తున్న గిరిజన మహిళలకు చేయూత ఇవ్వాలని భావించి ఉమ్మడి జిల్లాలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న బాలికల కోసం రూ.ఆరు లక్షల నుంచి రూ.8లక్షల వరకు కేటాయించి బాలికల పాఠశాలలకు లడ్డులు పంపిణీ చేస్తున్నారు. ఈ పథకం ఆదివాసీ ఆహారం పరిశ్రమ నడిపిస్తున్న గిరిజన మహిళలకు కూడా కలిసి వచ్చింది.

రోగ నిరోధక శక్తి పెంపు కోసం..

గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అమలు చేస్తున్న ఆరోగ్య పోషణమిత్ర పథకం ద్వారా ఇప్పపువ్వు లడ్డుల పంపిణీ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుంది. చిన్నచిన్న వ్యాధులకే గిరిజన ప్రాంతాల బాలికలు పౌష్టికా ఆహార లోపంతో పాటు రక్తలేమి ఉండడంతో రోగ నిరోధక శక్తి తగ్గిపోయి మరణాలు సంభవిస్తున్నాయని గ్రహించిన అధికారులు ఆరోగ్య పోషణ మిత్ర పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలోని 33 బాలికల పాఠశాలలతో పాటు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని 28 పాఠశాలు, మంచిర్యాల జిల్లాలోని ఆరు పాఠశాలు, నిర్మల్ జిల్లాలోని ఏడు బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పపువ్వు లడ్డు పంపిణీ కార్యక్రమం మూడు నెలల కింద ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాలోని బాలికల పాఠశాలలో 8,307 మంది బాలికలు ఉండగా 7,043 మంది బాలికలకు పరీక్షలు చేపట్టగా.. 116 మంది బాలికల్లో ఎనిమిది గ్రాముల రక్తలేమితో ఉన్నారని గుర్తించారు. అలాగే కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 5517 మంది బాలికలు ఉండగా.. 4989 మంది బాలికలకు పరీక్షలు నిర్వహించగా 103 మంది బాలికలు రక్తలేమితో ఉన్నారని గుర్తించారు. అలాగే మంచిర్యాల జిల్లాలో 1239 మంది బాలికలు ఉండగా.. 949 మందికి పరీక్షలు నిర్వహించగా 39 మంది రక్తలేమితో, నిర్మల్ జిల్లాలో 2083 మంది బాలికలు ఉండగా 1951 మందికి పరీక్షలు నిర్వహించగా.. 211 మంది బాలికలకు 8 గ్రాముల లోపు మాత్రమే రక్తం ఉన్నదని గుర్తించారు. దీంతో వారంలో బుధవారం, శుక్రవారం రెండేసి ఇప్పపువ్వు లడ్డులతో పాటు పోలిక్‌యాసిడ్, విటమిన్ సి మాత్రలు అందించారు. దీంతో బాలికల్లో 10 నుంచి 11 గ్రాముల హిమోగ్లోబిన్ పెరిగినట్లు అధికారుల ద్వారా తెలసింది. ఉట్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గేడం అనిత 7.2 గ్రాముల రక్తం ఉండడంతో ఫిబ్రవరి మొదటి వారంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా.. 14.4 గ్రాములకు హిమోగ్లోబిన్ పెరిగింది. అదేమాదిరి మరో విద్యార్థిని జంగుబాయికి కూడా ఏడు గ్రాముల హిమోగ్లోబిన్ ఉండగా.. ఈ నెలలో నిర్వహించిన పరీక్షలతో హిమోగ్లోబిన్ శాతం 13.5 పెరిగింది.



ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన బాలికలు

జాతీయ స్థాయిలో బహుమతులు

తెలంగాణ విద్యాశాఖ అధికారులు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఉట్నూర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు మౌనిక, జ్యోతికలు ఇప్పపువ్వు లడ్డు తయారీ చేసి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. అదే మాదిరి జాతీయ స్థాయిలో గత జనవరి 20 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఇప్పపువ్వు లడ్డు తయారీకి ఇదే బాలికలు నాలుగో స్థానంలో బహుమతి అందు కున్నారు. అడవుల్లో లభించే ఇప్పపువ్వును ఎండబెట్టి నెయ్యిలో వేయించి జీడిపప్పు, నువ్వులు, బాదం, బెల్లం కలిపి లడ్డు తయారు చేయడం ద్వారా బాలికల్లో హిమోగ్లోబిన్ పెరుగుతుందని సైన్స్ ఫెయిర్‌లో వివరించామని బాలికలు వివరించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థినిలు

బలన్‌పూర్ గ్రామంలో వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలను పూజచేసి ప్రారంభిస్తున్న నాయకుడు

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బలన్‌పూర్ గ్రామంలో యువకులు ఆదివారం వాలీ బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్రీడలవల్లనే యువత శారీరకంగా బలిష్టంగా తయారవుతారన్నారు. ప్రస్తుతం యువత సెల్‌ఫోన్‌కు బానిసగా మారుతున్న తరుణంలో బలన్‌పూర్ గ్రామంలోని యువత దానికి భిన్నంగా వాలీబాల్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలలో విజ యం సాధించిన జట్లకు బహుమతులుంటాయని వారు తెలిపారు. కార్యక్ర మంలో క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బోల్తా పడిన వాహనం



రోడ్డుపై బోల్తా పడిన వాహనం

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలం పరిదిలోని జాతర్ల, దేగామ గ్రామాల మధ్య గల రహదారిపై మూల మలుపు వద్ద పశుగ్రాసాన్ని ఇచ్చోడకు తరలించగ మార్గ మధ్యలో గల మూల మలుపు వద్ద వాహనం బోల్తా పడింది. రోడ్డు పై ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడంతోనే వాహ నం అదుపుతప్పి బోల్తాపడిందని సమీప గ్రామస్థులు తెలిపారు. గతంలో కూడ ఇటువంటి ప్రమాదాలు జరిగాయని మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అదికారులకు చెప్పినప్పటికి బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతోనే తరుచు ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఇప్పటికైన సంబందిత అధికారులు వెంటనే సూచిక బోర్డులను మూల మలుపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



కేంద్రమంత్రిని కలిసిన నాయకులు

తలమడుగు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి బండిసంజయ్‌ని ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బీజేవై ఎం యువమోర్చ మం డల అధ్యక్షులు దాతాజికిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం, బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతికార్యకర్త సైనికుడిగా పనిచేయాలని సూచించారన్నారు. అంతే కాకుండా త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిం చాలన్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన పథకాలను గ్రామీణప్రజలకు వివరించే బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థితో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

నిజామాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మె ల్సీ బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డితో కలిసి నిజామాబాద్ అర్బన్ ఎమ్మె ల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మార్నింగ్ వాక్ చేశారు. ఆది వారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, పాత కలెక్టరేట్ మైదానం, ఐటీఐ మైదానంలో వాక్ చేస్తూ వారికి మద్దతు గా మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులకు, మేధావులకు ఎమ్మెల్యే ధన్‌పాల్ విజ్ఞప్తి చేశారు.

మొక్కజొన్న పంట దగ్ధం



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన మొక్కజొన్న పంట

బోథ్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన తోట లింగయ్య అనే రైతుకు చెందిన మొక్క జొన్న పంట ఆదివారం మధ్యాహ్నం షాక్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యింది. రెండు ఎకరాలలో వేసిన మొక్కజొన్న పంట చేనులో నుంచి వెళ్లిన విద్యుత్ తీగల రాపిడితో నిప్పురవ్వలు పడి దగ్ధమైనట్లు ప్రత్యక్ష సాక్షు లు తెలిపారు. అయితే దీంతో రైతుకు లక్ష రూపాయల మేరకు నష్టం సంభవించిందని వాపోయారు. కాగా సంఘటన స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు.

ఆసరా లబ్ధిదారుల ఎదురు చూపులు

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదని లబ్ధిదా రులు ఆందోళన చెందుతున్నారు. వృద్ధులకు 4016, దివ్యాంగులకు 6016, ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా దాని ప్రస్తావనే లేకపోవడంతో లబ్ధిదారులు ఆశగా వేచి చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది అవుతున్న ఆసర పింఛన్ల పెంపు ఊసెత్తడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2016, పెన్షన్ ఇవ్వగా తాము అధికారంలోకి వస్తే ఆసరా పెన్షన్‌లు రెండింతలు చేస్తామని, కుటుంబంలో ఇద్దరికి సమానంగా పెన్షన్లు ఇస్తామని 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. కాగా ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా హామీ అమలు కావటం లేదని పెన్షన్‌దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న పెన్షన్ తమ అవసరాలకు ఉపయోగపడుతున్నప్పటికీ ప్రస్తుతం నిత్యవసరాల ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వం పెన్షన్ డబ్బులు ఏ మాత్రం సరిపోవడం లేదని పెన్షన్‌దారులు చెబు తున్నారు. ప్రభుత్వం పెన్షన్ పెంపు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీల్లో భాగంగా ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పింఛన్లు పెంపు విషయం పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన ప్రభుత్వం తమ పెన్షన్లు పెంచుతుందని ఎన్నో ఆశలు ప్రభుత్వం పై పెట్టుకున్నామని పెన్షన్‌దారులు ఆవేదన చెందుతున్నారు. వృద్ధులకు 2016 నుంచి 4016కు, దివ్యాంగులకు 4016 నుంచి రూ. 6016కు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆ హామీ ప్రకారం ఆసర పెన్షన్లను పెంచి ఆదుకోవాలని లబ్ధిదారలు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇటీవల నిర్వహించిన కేబినేట్ సమావేశంలోనూ పింఛన్లను పెంచే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 66983 మంది పెన్షన్ దారలున్నారు. ఇందులో వృద్ధాప్య పెన్షన్ దారులు 21945, దివ్యాంగులు 7062, వితంతువులు 28730, చేనేత పెన్షన్లు 18, గీతాకార్మికులు 41, బీడి కార్మికులు 5515, ఒంటరి మహిళలు 2221, ఫైలేరియా బాదితులు 583, హెచ్ఐవి పెన్షన్స్ 868, మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా సుమారు 14.92కోట్లు రూపాయలను ఆసరా పెన్షన్ల ద్వారా ప్రభుత్వం అందజేస్తోంది.

గ్రామాల అభివృద్ధి నా బాధ్యత : ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



బీజేపీనాయకుడిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి16 (ఆంధ్ర జ్యోతి): నియోజక వర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి తన బాధ్యత అని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌తో పాటు వందమంది ఆయన అనుచరులు, ఆరేపల్లి గ్రామానికి చెందిన కోర్టికల్(బీ) గ్రామ పంచాయతీ మాజీసర్పంచ్ రవీందర్, గ్రామానికి చెందిన పలు వురు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చు కున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వారికి గులాబి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సాబ్లె సంతోష్‌సింగ్ మట్లాడుతూ కార్యకర్తలకు గుర్తిం చడంలో బీజేపీ విఫలమైందన్నారు. నమ్ముకున్న కార్యకర్తలకు తగిన ఫలితం కల్పించట్లేదని తెలి పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పాలనపై ప్రజలు తిరగబడుతున్నారని, ఇక తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశం ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను గుర్తించడంతో పాటు తగిన స్థానం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్,జాదవ్‌గణేష్, పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, గులాబ్‌సింగ్, గులాబ్, పవన్, దేవేందర్‌రెడ్డి, రాథోడ్‌సురేందర్ పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా బాసరలో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి మహోత్సవాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేశారని హైదరాబాద్‌లో 100 కోట్ల విలువ గల స్థలంలో రూ.25కోట్లతో బంజారా భవన్ నిర్మించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ తదితరులు పాల్గొన్నారు. సోమవారం జరిగే బ్లడ్ డోనేషన్ క్యాంపును విజయవంతంగా చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్‌జ నార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరి రావు జన్మదిన వేడుకలు ఆదివారం పలువురు నాయ కులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఏఎంసీ నిర్మల్ చైర్మన్ భీమ్ రెడ్డి, సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ హదీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాందేడుపు చిన్ను, నాయకులు జిషన్ ఖాన్, సభా కలీం, అతిక్ అహ్మద్, పోశెట్టి, వాజిద్ అహ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్ : నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు జన్మదినం సందర్భంగా ఆదివారం దేవరకోట ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొండా శ్రీనివాస్, డైరెక్టర్లు సంతోష్, నరేందర్, చిరంజీవి, రాజన్న పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండల కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు జన్మదిన వేడుకలను వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మండల పార్టీ అధ్య క్షులు ఒడ్నాల రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక అష్టభుజ వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీహరి రావు ఆయురా రోగ్యాలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎంపీపీ నరేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నగేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు సిరాజు ద్దీన్, అట్ల చిన్న రామ్ రెడ్డి, సమ్మెట రవి, బిట్లింగ్ రజినీకాంత్, అస్గర్, బీసీ మండల అధ్యక్షులు ఎం. వినేష్, డైరెక్టర్ సురేష్, గంగయ్య, భీమేష్, సుభాష్, బి. రమేష్, కల్లెడ భూమన్న, గుర్రాల పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సు మలత తెలిపిన వివరాల ప్రకారం... మల్లాపూర్ గ్రామానికి చెందిన రేణి మల్లేష్(56) అనే వ్యక్తి గత శనివారం రాత్రి సమయంలో టీవీఎస్ ఎక్సెల్ అనే ద్విచక్ర వాహనంపై లక్ష్మణచాంద నుంచి మల్లాపూర్ గ్రామానికి వెళ్తుండగా ద్రోణ ప్రైవేట్ పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డు పక్కన గల వరి పొలాలలో పడి మృతి చెందాడు. మల్లేష్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సీసీ కెమెరాలను పరిశీలించాలి...

గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి వాహనాన్ని, నేరస్తులను పట్టుకోవాలని మల్లాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. రేణి మల్లేష్ లక్ష్మణచాంద నుంచి బయలు దేరిన సమయంలో ఏఏ వాహనాలు వెళ్లాయో ఆయా గ్రామాల్లో గల సీసీ కెమెరాలను, అలాగే పెట్రోల్ పంప్‌ల ముందు గల సీసీ కెమెరాలను, దుకాణా సముదాయాల ముందు గల సీసీ కెమెరాలను పరిశీలిస్తే వాహనాన్ని, నేరస్తులను ఈజీగా పట్టుకునే అవకాశం ఉందన్నారు. రాత్రి సమ యంలో కొన్ని భారీ వాహనాలు వేగంగా వెళ్త న్నాయన్నారు. ఎన్నిసార్లు మేము కూడా ప్రమా దాల భారీ నుంచి తప్పించుకున్నామని పలువురు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి పోలీసులు పకడ్బందీగా పర్యవేక్షణ చేసి నేర స్తులను పట్టుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్ - నిజామాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల మద్ధతులో బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్‌ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఉదయం వేళల్లో వాకర్ అసోసియేషన్స్, టీ క్యాంటీన్లలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్,జిల్లా ఉపాధ్యక్షులు సూర్య కుమార్, జిల్లా కార్యదర్శులు విలాస్‌రావు, గౌస్‌మొయినుద్దీన్,వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

తలమడుగు రూరల్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కకొమురయ్య పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ అసెంబ్లి టీచర్స్ ఎమ్మెల్సీ ఇన్‌చార్జీ బోండ్ల వెంకటస్వామి కోరారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసం, నిరుద్యోగుల ఉద్యోగ అవకాశాల కోసం భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఇందులో పురుషోత్తం, శ్రీనివాస్‌రెడ్డి, ఆశీష్, విష్ణు ప్రసాద్, సుదర్శన్, కందిస్వామి, జ్ఞానేందర్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్లి(టి) పాఠశాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఉట్నూర్ పాఠశాలలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

భీంపూర్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): అర్లి(టి) గ్రామంలో జడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 2005-2006 బ్యాచ్‌విద్యార్థులు 20 ఏళ్ల పూర్తి కావడంతో గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే వేదిక పై కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నేమరేసుకున్నారు. ఆట పాటలతో అలరించారు. అంతకు ముందు గురువులు, విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఒకరి ఒకరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురువులను శాలువాత మేమెం టోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు భారతి మేడమ్, మల్లయ్య,హెచ్ఎం మహాలక్ష్మి, ఉపాధ్యా యులు రామకృష్ణ, మహేశ్, సుదర్శన్‌గౌడ్, సరోజ, రమేష్‌రెడ్డి, విద్యార్థులు మహేందర్, రమాకాంత్, లతీఫ్, మహేష్, మచెందర్, పుష్ప లతా, లత, సవిత, నవనీత, ప లువురు విద్యా ర్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్: పాతికేళ్లకు ముందు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అందరు కలుసుకున్న అపూర్వమైన రోజు ఆదివారం. 1999-2000 సంవత్సరంలో ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుతున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా పాటలు పాడుతు ఆటలు ఆడుతూ పదవ తరగతి నాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఈ సందర్భంగా టీచర్లను ఘనంగా సన్మానించారు.

మాజీమంత్రి జన్మదిన వేడుకలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంత్రి వ్యక్తిగత పీఏ నాళం శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. నాయకులు ముడుసు సత్యనారాయణ, అప్పాల మహేష్, ధర్మాజీగారి రాజేందర్, భాస్కర్, శ్రీనివాస్, మేడారపు, ప్రదీప్, బన్సపెల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంఈవో మృతి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఎంఈవో లక్కడి రాంచందర్ రెడ్డి ఆదివారం అకాల మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలు వురు ఉపాధ్యాయులు, నాయకులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యు లకు సానుభూతి తెలిపారు.

'డబుల్' కాలం ముగిసిపోతోంది



రాజూరాలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

కుభీర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం అన్ని గ్రామాల్లో అర్హులకు రెండు పడకల ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించింది. ఆ మేరకు మండలంలోని ఎనమిది గ్రామాలను ఎంపిక చేసి 15 నుంచి 25 చొప్పున రెండు పడక గదులు ఇళ్ల నిర్మాణం చేపట్టింది. మండలంలోని వీరేగాం, రాజూరా, హల్దా, మాలేగాం, సాంవ్లీ, వర్ని, కుప్టి , సాంగ్వీ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాక కొన్ని పిల్లర్ల దశలోనే ఉంటే మరికొన్ని నిధుల లోపంతో బెడ్ లెవెల్‌లోనే ఆగిపోయాయి. మరికొన్ని నిర్మాణాలు లబ్ధిదారుల ఎంపిక జాబితాపై చాలా చోట్ల వివాదాలు చెలరేగాయి. దీనికి తోడు గుత్తేదారులకు సకాలంలో బిల్లు మంజూరు కాక పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇక అంతే ఇళ్ల పంపిణీ వాయిదా పడింది. మళ్లి కొత్త ప్రభుత్వం కొలువైంది. ఏడాది గడిచిపోయింది. ఇంత వరకు ఈ ఇళ్ల జోలికెళ్లలేదు. అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడంతో పిల్లర్ల దశలోనే పాడవుతున్నాయి. మండలంలోని వీరేగాం తాండాలో మొదటి విడతలో నిర్మించిన రెండు పడకల ఇండ్లు పూర్తి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కుప్టి , హల్దా, సాంవ్లీ, మాలేగాం, గ్రామంలో నిర్మాణాలు పూర్తి కాక పోయిన లబ్ధిదారులు స్వంతగా నిర్మించుకుంటున్నారు. సాంగ్వీ, వర్ని, రాజూరా గ్రామాల్లో చేపట్టిన రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు. ప్రస్తుత ప్రభుత్వమైన నిధులు మంజూరు చేసి పూర్తి చేసి పేదలకు అందజేస్తే ప్రయోజనం చేకూరుతుందని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ బిల్లులు సకాలంలో రాకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రమాదకరంగా గుంత



పల్సి-కుభీర్ రోడ్డు మధ్య ఏర్పడిన గుంత

కుభీర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే కుభీర్-పల్సి రోడ్డు మధ్యలో పల్సి గ్రామ శివారులో గల కల్వర్టు వద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి గుండా మండల కేంద్రం నుండి పల్సితో పాటు సరిహద్దు మహారాష్ట్ర గ్రామాల వాసులు రాకపోకలు చేస్తూ ఉంటారు. ఈ రోడ్డుపై కొత్తగా వెల్లే వాహనదారులకు దగ్గరగా వచ్చేంత వరకు గుంత ఏర్పడక పోవడం మూలంగా అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

విచిత్ర వాతావరణంతో జనం బెంబేలు

● మధ్యాహ్నం మండుతున్న ఎండలు ● రాత్రి పూట వణికిస్తున్న చలి



భీంపూర్ మండల కేంద్రంలో ఎండదెబ్బకు నిర్మానుష్యంగా మారిన రహదారి

భీంపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దినంలో బాగంగా మండుతున్న సూర్యుని వేడికి తట్టుకోలేక జనం విలవిలలాడుతున్నారు. అదే రాత్రి పూట చలి తీవ్రతతో జనం వణికి పోతున్నారు. ఎండ, చలితో దిక్కుతోచని స్థితిలో జనం విలవిలలాడుతున్నారు. రాత్రి పూట చలి మంటలు కాగుతు కాలం వెళ్ల దీస్తున్నారు. జనం అదే దినంలో ఎండ వేడిమి భరించలేక కూలర్‌లను ఫ్యాన్ లను ఆశ్రయిస్తున్నారు. ఈ వింత వాతావరణంతో జనం అల్లడిపోవడం తప్ప చేసేదేమి కనిపించడం లేదు. మండలంలోని ప్రజలు చలికి వణుకుతు ఎండ వేడిమిని తట్టుకుంటు పొలం పనులకు వెళ్లక తప్పడం లేదు. ఈవింత వాతావరణ పరిస్థితి ఎప్పుడు చూడలేదు అని కలికాలం అంటే ఇదేనేమో అని జనం ఆశ్చర్యానికి గురి అవుతున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే ఇంకా మూడు నెలల వేసవి కాలాన్ని ఎలా గడపాలో అని మండల ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.



పిప్పల్‌కోటిలో చలిమంటలు కాచుకుంటున్న జనం

అతివలకు అండగా.. ఆదిలాబాద్ మెప్మా!

● బ్యాంకు లింకేజీ రుణాలతో ఆర్థిక అభివృద్ధి ● మహిళల ఆర్థిక అభివృద్ధికి బాటలు



మహిళా క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతం కోసం ఆదిలాబాద్ మున్సిపల్ మెప్మా శాఖ కృషి చేస్తున్నది. గతేడాది వంద శాంతపైగా రుణ లక్ష్యాలను సాధించి మహిళల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తున్నది. అదే ఉత్సాహంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇచ్చి మహిళల ఆర్థిక స్వాలంభన దిశగా కార్యాచరణను ప్రారంభించాయి. జిల్లాలోని రూ.19.50 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు రూ.19.67 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సంప్రదించి రుణాలు ఇప్పించే బాధ్యతను మెప్మా సీవోలు, ఆర్పీలకు అప్పగించారు. రుణాలు లభిస్తే స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పట్టణంలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు అందించి తోడ్పాటు అందిస్తున్న నేపథ్యంలో మెప్మా సేవలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

అతివల అభివృద్ధికి బాటలు

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 2500 సంఘాలు ఉన్నాయి. ఇందులో ఆర్పీలు, మహిళలకు ఆర్థిక స్వావలంబన, స్త్రీ నిధి రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడతారు.

గతేడాది రూ.17 కోట్లు

2023-24 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ పరిధిలో రుణాలను అందించారు. పట్టణంలో 350 సంఘాలకు రూ.17.08 కోట్లు లక్ష్యానికి 432 ఎస్‌హెచ్‌జీలకు 43.81 కోట్ల రుణాలు సంఘాలకు అందజేశారు. సంఘాల పరంగా కాకుండా బ్యాంకు లింకేజీ పరంగా 236 శాతం రుణాలను అందజేశారు. ఈ రుణాలతో మహిళలు ఎంబ్రాయిడరీ, మగ్గం పనులు, టైలరింగ్, బ్యూటీపార్లర్, గాజులు, చెప్పుల దుకాణాలను ఏర్పాటు చేసుకోగా, పలువురు పచ్చళ్ల తయారి చేపడుతున్నారు. మరికొందరు మహిళలు వారి కుటుంబ సభ్యులు నిర్వహించే వ్యాపార నిర్వహణకు వినియోగిస్తున్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ (ఫైల్)

విజయవంతంగా మహిళా క్యాంటీన్‌ల నిర్వహణ

అదిలాబాద్ పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. వీటితోపాటు ప్రభుత్వ ఆస్పత్రులు, మున్సిపల్ కార్యాలయాలు తదితర చోట్ల నెలకొల్పిన క్యాంటీన్‌లు సైతం మహిళా సంఘాల సభ్యులకు లాభాదాయకంగా మారాయని అధికారులు చెబుతున్నారు. అల్పాహారం, భోజనం, స్నాక్స్, టీ, కాఫీలు క్యాంటీన్‌లలో అందుబాటులో ఉంటున్నాయి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, అధికారులు, సిబ్బందికి క్యాంటీన్‌లు ఎంతగానో ఉపయోగపడుతన్నాయి.

ప్రభుత్వ పథకాల్లో మెప్మా సేవలు

మెప్మా శాఖలోని ఆర్పీలు శాఖా పరమైన పనులే కాకుండా ప్రభుత్వ పథకాల పనుల్లో పాల్గొని విశేష సేవలు అందిస్తున్నారు. పని ఒత్తిడి అయినా కూడా భరిస్తూ శాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కరోనా సమయంలో కూడా సిబ్బంది విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాలు బ్యాంకు రుణం ఇప్పిస్తే వారి యొక్క స్లాబ్ లెవెల్ ఫెడరేషన్ కింద 0.5 సేవా రూపంలో కడతారు. రుణాలు నేరుగా లబ్దిదారులకు జమవుతాయి. మహిళా సంఘాలకు వారి వ్యక్తిగత ఖాతాలోని జమవుతాయి.

ఇందిరా మహిళా శక్తి పథకం

ఇంద్ర మహిళా శక్తి పథకం కింద 25 లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 18 యూనిట్లు గ్రౌండింగ్ పూర్తి చేశారు. వ్యక్తిగత యూనిట్స్ 144 లక్ష్యంగా ఉండగా 96 గ్రౌండింగ్ లెవెల్లో పూర్తి చేశారు. పట్టణ నిరాశ్రయుల కేంద్రాలు 2020కి ముందు సరైన పద్ధతిలో నిర్వహించలేదు. 2021 నుంచి పూర్తిస్థాయిలో పేదలకు నిరాశ్రయుల కేంద్రంలో ఆశ్రయం కల్పిస్తున్నాం.

లక్ష్యం కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తా

● శ్రీనివాస్,డీఎంసీ, మెప్మా



గతేడాది ఆదిలాబాద్ పట్టణంలో ఆయా బ్యాంకు లింకేజీ పరంగా 100 శాతం రుణాలను అందజేశాం. ఈ ఏడాది ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కొత్తగా 300 సంఘాలు ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సాధించేలా కృషి చేస్తాం. ఇందిరా మహిళా శక్తి, పీఎం ఈజీపీ, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ఇతర ప్రభుత్వ సహకారాలు అందజేస్తాం. సిబ్బంది పని విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం. గతంలో సైతం మా శాఖ లక్ష్యాలను 100 శాతం పూర్తి చేసి అందరి మన్ననలు పొంది జాతీయస్థాయిలో శాఖ ఎంపికైంది.

మహిళా క్యాంటీన్‌తో లాభాలు

● స్వరూపరాణి, ఆదిలాబాద్



క్యాంటీన్ నిర్వహణతో ప్రతినెలా రూ.30 వేల వరకు లాభాలు గడిస్తున్నాం. దీంతోపాటు నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాం. క్యాంటీన్ ఏర్పాటుకు అధికారులు ఎంతో సహకరించారు. ఇందులో టీ, టిఫిన్స్, స్నాక్స్, ఫుడ్, జ్యూస్ సెంటర్ ఏర్పాటు చేశాం. రుచి, శుభ్రత పాటిస్తూ కొనసాగిస్తున్నాం.

మాకు ఉపాధి దొరికింది

● శారద, మహాలక్ష్మి వాడ



ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో విజయ డెయిరీ ఏర్పాటు చేసుకున్నాం. ఇందులో పాలు పెరుగు, వెన్న, నెయ్యి, పాల పదార్థాలు తదితర నాణ్యమైన వస్తువులను అమ్ముతున్నాం. దీని ద్వారా ఆర్థికంగా లాభాలను గడిస్తున్నాం. దీనివల్ల పలువురికి ఉపాధి అందింది. మహిళల ఆర్థిక అభివృద్ధికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

యాంత్రీకరణలో కదలిక

● రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు అందజేసే యోచన
● యాసంగి సీజన్ నుంచే అమలుకు ప్రణాళిక ● ఆరేళ్ల అనంతరం సర్కారు చర్యలు

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరేళ్లుగా నిలిచి పోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ పథకాన్ని అమలు చేస్తే రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, యంత్రాలు రాయితీపై అందనున్నాయి. యాంత్రీకరణ పథకం పునరుద్ధరించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో అన్న దాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లు ఇతర పరికరాలతో సాగు చేసేందుకు రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. కూలీ సమస్యలు అధిగమించడంతో పాటు పనులు త్వరగా పూర్తయ్యేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు. ఉపకరణాలపై రాయితీ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో వారికి ఊరట లభించినట్లయింది. ఈ పథకం రాష్ట్రంలో ఆరేళ్లుగా అమలు కావడం లేదు. ఈ యాసంగి సీజన్ నుంచే ప్రారంభిస్తుండడం, శుభ పరిణామంగా భావిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాల పరిధిలో 1.60 లక్షల ఎకరాల్లో పలు రకాలైన పంటలను సాగు చేస్తున్నారు.

పథకంలో భాగంగా..

ఫాం మైకనేజేశన్ పథకంలో భాగంగా గతంలో ట్రాక్టర్ల సామాగ్రిని అంద జేశారు. ముఖ్యంగా గొర్రు, రోటవేటర్, మూడు కాళ్ల నాగల్లు, రొప్పు, అప్‌కేజ్ వీల్, (సగం దమ్ము చక్రాలు), చిన్న ప్లౌ, పెద్ద ప్లౌ పురుగు మందు పిచికారి, చేసే డబ్బాలు గతంలో 50శాతం రాయితీపై అందుబాటులో ఉండేవి. రైతులు వీటిని కొనుగోలు చేసి సేద్యం చేసే వారు. ప్రతీ వ్యవసాయ కార్యాలయాల వద్ద అవి ఎప్పుడు సిద్ధంగా ఉంచే వారు. ట్రాక్టర్లు ఉన్న రైతులు వీటిని తీసుకెళ్లేవారు. అనంతరం పూర్తిగా నిలిపివేశారు.

పల్లెల్లో ట్రాక్టర్లు..

జిల్లాలోని ప్రతీ గ్రామంలో ట్రాక్టర్ల ద్వారానే పొలాలు, భూములు దున్నుతున్నారు. సేద్యం పనులకు ఎక్కువగా ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. ముఖ్యంగా భూమి చదును చేసే గొర్రుకు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఆరేళ్ళుగా రాయితీని నిలిపి వేశాక ప్రైవేట్‌గ కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా రైతులకు అవసరమైనా రోట వేటర్లు, దమ్ము చక్రాలు, తైవాన్ స్ప్రేయర్లు, పింకర్లు, డ్రిప్ ఇరిగేషన్, లు రాయితీపై లభిస్తే చాలామంది కొనుగోలు చేసే అవకాశం ఉంది.

పరికరాల ఉపయోగాలపై..

పరికరాల ఉపయోగాలపై అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. మొదట వ్యవసాయ పరికరాలు, యంత్రాలతో జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నారు. వీటిలో పరికరాల ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు, నిపునులు పాల్గొని వాటి ఉపయోగం, పనిచేసే విధానం, రాయితీ అంశాలపై వివరించనున్నారు. అదే సమయంలో అవసరమున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకుని అర్హులకు అందజేయనున్నారు.

అందించేవి ఇవే..

పవర్‌టిల్లర్, హార్వేస్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, మామిడి కాయలు తెంపే పరికరం, పత్తితీత, గడ్డి కత్తిరింపు, మొక్కజొన్నలను ఒలిచే యంత్రాలను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కేజ్ వీల్స్, నాగళ్లు, ఇస్తే బాగుంటుందని రైతులు చెబుతున్నారు.

రైతులకు ప్రయోజనం

వ్యవసాయ పరికరాలు రాయితీపై అందిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. కూలి ధరలు సైతం అధికంగా ఉన్నాయి. వ్యవసాయ పరికరాలు అందజేస్తే పని సులువవుతుంది.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం
మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సాద్

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుగనంగా రైతులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం. గతంలో యాంత్రీకణ పథకం పై ప్రభుత్వం ప్రకటన మాత్రం విడుదల చేసింది వాస్తవమే. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఆదేశాలు వస్తే అర్హులకు అందజేస్తాం.



హీరాసుక చిత్రపటానికి పూజలు చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

ఘనంగా గోండి ధర్మ గురు హీరాసుక జయంతి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గోండి ధర్మ గురు, ప్రధాన్ ఆరాధ్య దైవం, కుల గురువైన హీరాసుక జయంతిని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి, ఆయన చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం మాట్లాడుతూ హీరాసుక చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, ప్రధాన్‌గూడ గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, మాజీ జడ్పీటీసీ పుష్పలతా, ప్రధాన్ పురహిత్ సంఘం మండల అధ్యక్షులు గేడం భారత్ పాల్గొన్నారు.

ఘనంగా బాల యేసు వార్షికోత్సవం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్రైస్తవుల ఆధ్వర్యంలో దివ్య బాల యేసు వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల యేసును ఊరేగింపులో కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు పలువురు భక్తులు భక్తి పాటలు పాడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

సమతా కుంభ్ - 2025 వేడుకల్లో నిర్మల్ నృత్య కళాకారులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం శ్రీరామనగరంలో చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సమతా కుంభ్ 2025 వేడుకల్లో పట్టణంలోని నృత్య కళాకారులు పాల్గొన్నారు. ఏడవ రోజు సందర్భంగా ఆదివారం 3 వేల మంది నృత్య కళాకారులతో సమతా మైత్రి స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని స్వరూపిణి నృత్య కళా క్షేత్రం గురువు నవ్య వినయ్ ఆధ్వర్యంలో నృత్య కళాకారులు పాల్గొన్నారు.

చికెన్ షాప్‌లకు బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్

● వెలవెలబోతున్న చికెన్ సెంటర్లు ● గిరాకీ లేక ఖాళీగా ఉన్న నిర్వాహకులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం రోజు కూడా చికెన్ షాపులు వెలవెల బోతున్నాయి. బర్డ్ ఫ్లూ భయంతో జనాలు చికెన్ తినేందుకు జంకుతున్నారు. ఎక్కడ వ్యాధి తమకు వస్తుందోనని భయంతో తినడం లేదు. కొన్నిరోజులుగా సోషల్ మీడియా, వార్తల్లో బర్డ్ ఫ్లూపై వస్తున్న కథనాలతో వ్యాపారం జరగడం లేదని చికెన్ దుకాణాల యాజమానులు అంటున్నారు. ఆదివారం వచ్చిందంటే రద్దీగా కనిపించే ఆదిలాబాద్ పట్టణంలోని ఠాగూర్ హోటల్, పాత బస్టాండ్ ఆవరణలోని చికెన్ సెంటర్లలో ఇప్పుడు గిరాకీలు లేకుండా బోసిపోయినట్లు కనిపిస్తోంది. ఇదిలా ఉంటే ప్రభుత్వం కూడా అలర్ట్ అయి జిల్లాల సరిహద్దులో పౌల్ట్రి, బ్రైలర్ కోళ్ల రాకుండా ప్రత్యేక చెక్ పోస్టు లను ఏర్పాటు చేసేల ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లాలో బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ లేదని, అయిన అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు చెబుతున్న ప్రజలు మాత్రం చికెన్ తినేందుకు జంకుతున్నారు. కాగా వ్యాపారాలు మాట్లాడుతూ ప్రతి ఆదివారం తమ గిరాకీ బాగుంటుందన్నారు. కానీ బర్డ్ ఫ్లూ కారణంగా చాలా మంది చికెన్ కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో వ్యాపారం సాగడం కష్టంగా మారిందన్నారు. కొన్ని సందర్భాల్లో అయితే వర్కర్లకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఏపీ, ఇతర రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం ఉందన్నారు. కానీ తాము లోకల్ ఫాం నుంచి కోళ్లను తీసుకు వస్తున్నామని తెలిపారు. తాము కూడా రోజు చికెన్ తింటున్నామని, ఫ్లూ లక్షణాలు ఇక్కడ లేవన్నారు.



ఆదిలాబాద్‌లో గిరాకీ లేక వెల వెల బోతున్న చికెన్ సెంటర్‌లు

నిర్మల్ రూరల్: నిర్మల్ పట్టణంలో ఆదివారం రోజు కిటకిటలాడే చికెన్ సెంటర్లు ఈ రోజు మాత్రం వెలవెలబోతున్నాయి. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ ధరలు భారీగా తగ్గిన భయంతో చాలా వరకు చికెన్ తినేందుకు ఇష్టపడడం లేదు. సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో పట్టణంలో చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ భయంతో జనం చికెన్ తినడానికి ధైర్యం చేయడం లేదు. డాక్టర్ సూచన మేర కు బాగా ఉడకపెట్టిన చికెన్ తినొచ్చని చెప్పినా ప్రజలు తినడానికి మొగ్గు చూపడం లేదు. ఆదివారం కావడంతో ప్రజలు మటన్, చేపల వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మటన్, చేపలకు భారీగా గిరాకీ పెరిగిపోయింది.



నిర్మల్‌లో వెలవెలబోతున్న చికెన్ సెంటర్



నిర్మల్‌లో చేపల కొనుగోలుతో రద్దీగా ఉన్న చేపల మార్కెట్

పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి

● డీటీఎఫ్ డిమాండ్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని డీటీఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్రచారి, చంద్రనాగకాంత్ విడుదల చేసిన ప్రకటనలో సౌకర్యాలు కల్పించకుండా పనులు చేయమనడం సరికాదన్నారు. జూనియర్ అసిస్టెంట్లను నియమించాలని, విద్యార్థుల మార్కుల ప్రగతి నమోదుకు ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ సరెండర్!





● బాబాపూర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ (ఫైల్)

- జిల్లా పోలీసుల కొత్త వ్యూహం
- మావోయిస్టుల కుటుంబ సభ్యులకు పరామర్శల పేరిట సంప్రదింపులు
- మారుమూల గ్రామాలపై ఫోకస్
- ఎస్పీ నేతృత్వంలో పక్కా ప్రణాళిక
- 'మన ఊరికి తిరిగి రండి' పేరిట పోలీసుల ప్రచారం



నిర్మల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదేళ్ల క్రితం వరకు పెద్ద ఎత్తున సాగిన నిషేధిత మావోయిస్టు కార్యకలాపాలు తిరిగి మొదలుకాకుండా చూసేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో మావోయిస్టు ప్రభావిత గ్రామాలు, మారుమూల పల్లెలపై పోలీసులు ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు. ఓ వైపు సామాజిక కార్యక్రమాలతో పాటు పోలీసులు మీ కోసం అంటూ ఇప్పటికే జనానికి చేరువయ్యే ప్రయత్నం చేస్తున్న పోలీసులు.. ఇక మావోయిస్టుల ప్రభావం గానీ వారి కదలికలుకానీ కనీస స్థాయిలో కనిపించకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఇందులో భాగంగానే పోరు కన్నా ఊరు మిన్నా.. మన ఊరికి తిరిగి రండి.. అంటూ మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలీసులు వినూత్నంగా ప్రచారం చేస్తూ ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న కొంతమంది మావోయిస్టు ఇళ్లకే కాకుండా పోలీసులకు గతంలో లొంగిపోయిన వారిని కూడా పరామర్శల పేరిట సంప్రదిస్తున్నారు. ఓ వైపు పోలీసు బలగాలు ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల్లోని అడవుల్లో కూంబింగ్ చేస్తూ మావోయిస్టుల ఏరివేత కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోలీసుల మావోయిస్టుల లొంగుబాట్లపైనే ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోనూ అలాగే అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు సొంత గ్రామాల్లో పోలీసులు లొంగుబాట్ల కోసం పకడ్బందీ వ్యూహాలను అమలు చేస్తున్నారు. నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్, పెంబి, దస్తూరాబాద్ మండలాల్లోని అనేక మారుమూల గ్రామాలు ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటలుగా ఉండేవి. ఈ గ్రామాలకు చెందిన అనేక మంది యువకులు అడవుల బాట పట్టారు. వీరిలో చాలా మంది ఎన్‌కౌంటర్‌లో మరణించడం, పోలీసులకు లొంగిపోవడం జరిగింది. కాగా, మరికొంతమంది ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉంటూ రాష్ట్ర, కేంద్ర కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారని పోలీసులు భావిస్తున్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులను ఎలాగైనా లొంగిపోయేందుకు అన్ని రకాల ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబ సభ్యులను పోలీసులు కలుస్తూ వారి ద్వారా లొంగుబాట్లకు బాటలు వేస్తున్నారు. ఇటీవల ఎస్పీ జానకీ షర్మిల ఖానాపూర్ మండలం బావాపూర్‌కు చెందిన శ్రీనివాస్ అనే అజ్ఞాత మావోయిస్టు కుటుంబ సభ్యులను కలిసి వారితో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే పేద కుటుంబానికి రెండు నెలల సరిపడా నిత్యావసర సరుకులను కూడా ఎస్పీ అందించారు. కొడుకును లొంగిపోయే విధంగా పిలుపునివ్వాలని సూచించారు. మావోయిస్టులకు సహకరించవద్దని, వారు ఊర్లల్లోకి వస్తే తమకు సమాచారం అందించాలంటూ కూడా కోరారు. కుటుంబ సభ్యులతోనూ, గ్రామస్థులతో ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. మావోయిస్టు గ్రామాలల్లో గోడ రాతలు, ఫ్లెక్సీ బ్యానర్‌లతో కూడా ప్రచారం చేస్తున్నారు.



మావోయిస్టు శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల (ఫైల్)

మిగిలి ఉన్న కొంతమంది కోసమే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చాలా మంది సీనియర్ మావోయిస్టులు ఇప్పటికే పోలీసులకు లొంగిపోయారు. అలాగే మరికొంతమంది పోలీసు ఎన్‌కౌంటర్‌లో కూడా మరణించారు. జిల్లాలోని సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన సట్వాజీ అలియాస్ సుధాకర్ రెడ్డి కొద్ది రోజుల క్రితం పోలీసులకు లొంగిపోయారు. సట్వాజీ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగానూ అలాగే ఝార్ఖండ్ రాష్ట్ర ఇన్‌చార్జిగానూ వ్యవహరించారు. ఆయనతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఉన్న ఆయన భార్య కూడా పోలీసులకు లొంగిపోయారు. గతంలో మురళీ అలియాస్ రవితో పాటు ఆయన భార్య సుజాత, అజయ్ తదితరులు కూడా పోలీసులకు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. కడెం మండలం లక్ష్మిసాగర్ గ్రామానికి చెందిన సీనియర్ మావోయిస్టు నేత కంతి లింగవ్వ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

కీలక కేడర్‌పైనే పోలీసుల దృష్టి..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అజ్ఞాత మావోయిస్టులపై పోలీసులు దృష్టి సారిస్తున్నారు. వారిని ఎలాగైనా లొంగుబాట పట్టించాలని పోలీసులు పకడ్బందీగా పావులు కదుపుతున్నారు. కొద్ది రోజుల క్రితం లక్ష్మణచాంద మండలం కూచన్‌పెల్లి గ్రామానికి చెందిన సెంట్రల్ కమిటీ మెంబర్ ఇర్పి మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులను కూడా పోలీసులు కలిసి లొంగుబాట్లపై చర్చించారు. అలాగే రాష్ట్ర కమిటీ సభ్యుడైన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ కుటుంబ సభ్యులతో కూడా పోలీసులు చర్చించారు. భాస్కర్ భార్య లింగవ్వ సొంత గ్రామమైన లక్ష్మిసాగర్‌లోని బంధువులను కూడా కలిసి పోలీసులు కలిసి లొంగిపోయే విధంగా చూడాలని కోరారు. కేంద్ర కమిటీ స్థాయి సభ్యులు బండి ప్రకాష్, సరోజ, కిష్టు, జాడి పుష్ప, బబ్బెర రవి, ఆత్రం లచ్చన్న తదితరులతో పోలీసులు లొంగుబాట్లకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబ సభ్యులను కలుస్తూ లొంగుబాటు ప్రయత్నాలను పోలీసులు ముమ్మరం చేస్తున్నారు. గ్రామ గ్రామాన అక్కడి యువకులతో కలిసి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఫ్లెక్సీ బ్యానర్లు, గోడలపై నినాదాలు, సోషల్ మీడియా ద్వారా కూడా లొంగుబాట్ల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



బంజారాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ● బాసరలో సేవాలాల్ మహరాజ్ జయంతోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

బాసర, ఫిబ్రవరి, 16 : (ఆంధ్రజ్యోతి) : బంజారాల వర్గీయుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క చెప్పారు. బాసర పుణ్యక్షేత్రంలో బంజారాల ఆరాధ్య గురువు సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని బహిరంగ సభ నిర్వహించారు. తెలంగాణ ప్రాంతంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి బంజారాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, ఉన్నత స్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై ప్రసంగించారు. బంజారాల అభివృద్ధికి అండగా ఉంటామని అన్నారు. బంజారాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వారి అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే స్థలం కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే రామరావు పటేల్ మాట్లాడుతూ బాసర పుణ్యక్షేత్రానికి సేవాలాల్ మహరాజ్‌కు ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ ఐదెకరాల స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమానికంటే ముందు మంత్రి సీతక్క బంజారాల మహిళలతో కలిసి వారి సాంప్రదాయ నృత్యాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ నగేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావు చౌహన్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎమ్మె ల్యేలు విఠల్ రెడ్డి, నారాయణ రావు పటేల్, రేఖా శ్యాం నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, జయంతి ఉత్సవాల కన్వీనర్ రాజేష్‌బాబు తదితరులు పాల్గొ న్నారు.

హామీలు అమలు పరుస్తున్నాం..

భైంసా : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ.. వాగ్దానాలను నెరవేరుస్తోందని రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని హరియాలీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దశాబ్ద కాలంగా ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రచారానికే పరిమితమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారు అనతికాలంలోనే నిరుద్యోగ యువతకు వేలాది ఉద్యోగాలు కల్పించడమే కాకుండా పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ డా. వేణుగోపాలచారి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం కేసులను మాఫీ చేయించుకునేందుకు గాను లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో జత కట్టిందని ఆరోపించారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని విధాలుగా న్యాయం జరుగుతోందని వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించే దిశగా చర్యలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలను ప్రకటనలకు పరిమితం చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో చూపెడుతుందన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. కాంగ్రెస్ శ్రేణులన్నీ కార్యోన్ముకులై పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపుకు అంకితమవ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులందరికీ తన సొంత నిధులు వెచ్చించి రూ. 3లక్షల ప్రమాద బీమా కల్పిస్తాననీ వెల్లడించారు. ఇందులో ముథోల్ కాంగ్రెస్ ఇంచార్జ్ బోస్లే నారాయణ్ రావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావ్ పాటిల్, పార్టీ ప్రతినిధి సుగుణక్క పాల్గొన్నారు.

ఏడాదిలో 53 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం : మంత్రి సీతక్క

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సర కాలంలోనే 53 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని మంత్రి సీతక్క తెలిపారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో ఆదివారం సీతక్క మాట్లాడుతూ... పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలని పేర్కొన్నారు. అదేవిధంగా రైతులకు సన్న వడ్లు పండిస్తే బోనస్ ఇవ్వడం జరిగిందని, రైతు భరోసా కింద భూమిలేని పేదింటి బిడ్డలకు రైతు భరోసా ఇచ్చాని, మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యేలు వేణుగోపాల చారి, విఠల్ రెడ్డి, నారాయణ రావు పటేల్, పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

● విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

కడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని లింగాపూర్‌లో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, విశ్వబ్రాహ్మణులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో పేర్ల నమోదుకు 28 వరకు అవకాశం : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వేలో పాల్గొనని వారు పేర్లు నమోదు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ పరిధిలోని పంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల ప్రజలు మున్సిపాలిటీలలో తమ వివరాలు కులసర్వేలో అధికారులకు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. సర్వేలో పాల్గొనని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. సర్వేపై సందేహాలను కలెక్టర్ కంట్రోల్ రూమ్ నెంబర్ 6305646600కు ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

మల్లన్న దేవుడి హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు చేస్తున్న కమిటీ సభ్యులు

ముథోల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్న దేవుడి హుండీ లెక్కింపు ఆదివారం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యం లో చేపట్టారు. శనివారం దేవుడి జాతర ముగిసింది. ప్రతి సంవత్సరం దేవుడి జాతర జరిగిన తర్వాతనే ఈ హుండీ లెక్కింపు చేస్తారు. నగదు రూ.5,03,920లతో పాటు బియ్యం, బెల్లం, మిశ్రమ వెండి 42.5 తులాలు, మిశ్రమ బంగారం 7 మాసాలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు ఆశన్న, అశోక్, నాయకులు, గ్రామస్తులు, సాయంరెడ్డి, గంగారెడ్డి, దత్త్రాత్రి, రవీందర్ రెడ్డి, విఠల్ యాదవ్, గురుప్రసాద్ యాదవ్, నిమ్మ పోతన్న, మాణిక్ రెడ్డి, గంగారెడ్డి,ముత్యం రెడ్డి, సుంక రాములు, భూమన్న, కండెల సాయినాథ్, గంగాధర్, నల్ల విఠల్ రెడ్డి, సుధాకర్, ప్రవీణ్ రెడ్డి, రాజన్న, దిగంబర్ పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల తొలగింపు



విశాలమైన రోడ్డు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మణచాంద నుంచి మల్లాపూర్ మార్గంలో ప్రమాద కరంగా ఉన్న చెట్లను, పిచ్చిమొక్కలను సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మణచాంద పోలీసులు ఆదివారం తొలగించారు. వీటి కారణంగా పలువురు ప్రమాదాల బారినపడుతున్నందున రోడ్డును క్లియర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్ కుమార్‌తో పాటు ఎస్సై సుమ లత, పోలీస్ కానిస్టేబుళ్లు అశోక్, సంతోష్, నరేష్, తదితరులు ఉన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

లోకేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీలు అమలు చేయాలని ఈ నెల 20న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే.రాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల రోజున ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్‌లను ఆదివారం లోకేశ్వరం మండలం పుష్పూర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నిర్మల్ - ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జే. రాజు మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తయినా ఇప్పటి వరకు, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నారు.